## క్లుప్తంగా

### సంక్రాంతిని సంతోషంగా జరుపుకోండి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



కోవూరు : నియోజకవర్గంలోని ప్రజలందరూ సంక్రాంతి పర్వదినాన్ని కుటుంబంతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఎవరూ ఎటువంటి వివాదాలకు పోకుండా పండగను జరుపుకోవాలన్నారు. ప్రజలకు ఆ భగవంతుడు సుఖ సంతోషాలతో పాటు ఆయురారోగ్యాలు కలుగజేయాలని ఆయన ఆకాంక్షించారు.

### కోడి పందేల స్థావరాలపై దాడులు

మనుబోలు : కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని కట్టువపల్లిలో ఆదివారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. కట్టువపల్లి పంట పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్సై అజయ్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి దాడులు చేశారు. మొత్తం ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.14,500 నగదు, నాలుగు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### మహారుద్రాభిషేకానికి ఆహ్వానం



నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి పీఠాన్ని జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధిరోహించాలని కాంక్షిస్తూ కొడవలూరు మండలం నార్తురాజుపాళెంలో శనివారం నిర్వహించనున్న నారికేళ సహిత రసలింగేశ్వర మహారుద్రాభిషేకం, సుదర్శన యాగానికి హాజరుకావాలని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం ఆహ్వానించారు. ఈ మేరకు ఎంపీని నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### డీఎల్పీఆర్వోకు పదోన్నతి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లా పౌరసంబంధాల శాఖ డీఎల్పీఆర్వో రమేష్‌కు పదోన్నతి లభించింది. ప్రకాశం జిల్లా డీపీఆర్వోగా నియమిస్తూ ఐ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులను ఆదివారం జారీ చేశారు. రమేష్‌కు డీడీ సదారావుతో పాటు పలువురు అభినందనలను తెలియజేశారు.

# ఆనందోత్సాహాలతో భోగి



పొదలకూరు మండలంలో..



కొడవలూరు : కమ్మపాళెంలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు

కొడవలూరు : భోగి పండగ పర్వదినాన్ని మండలంలో ఆదివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. శనివారం రాత్రి 12 గంటలు దాటగానే అన్ని గ్రామాల్లో భోగి మంటలు వేయడం ప్రారంభించారు. దీంతో అన్ని గ్రామాలు భోగి మంటల కాంతిలో వెలిగిపోయాయి. నార్తురాజుపాళెం, కొడవలూరు, యల్లాయపాళెం, గండవరంలలో యువకులు పోటీ పడి గ్రామ కూడళ్లలో భోగి మంటలు వేశారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథి గృహంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటలు వేశారు.

**ఉత్సాహంగా..**

ఇందుకూరుపేట : భోగి పర్వదినాన్ని మండల వాసులు ఆదివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. సంస్కృతి సంప్రదాయాలను అనుసరిస్తూ భోగి మంటలు వేశారు. తలంటు స్నానాలు చేసి కొత్త దుస్తులు ధరించారు. ఒకరికొకరు భోగి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పెద్దలు పిల్లలపై భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు. లోగిళ్ల రంగు రంగుల ముగ్గులతో శోభను సంతరించుకున్నాయి. కుటుంబ సమేతంగా పిండి వంటలు ఆరగిస్తూ సంతోషంగా గడిపారు. యువత సాంప్రదాయ ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. దీంతో గ్రామాల్లో సందడి నెలకొంది.

**వేడుకగా..**

పొదలకూరు : మండలంలో భోగి పండగను ఆదివారం వేడుకగా జరుపుకున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు పోటీ పడి భోగి మంటలు వేశారు. కొత్త అల్లుళ్లు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో పల్లెలు కళకళలాడాయి. పిల్లలు గాలిపటాలు ఎగుర వేయడంతో పాటు, క్రికెట్, కబడ్డీ క్రీడలు ఆడారు. పట్టణాల్లో ఉద్యోగులు, ఇతర రంగాలకు సంబంధించిన వారు పల్లెలకు చేరుకోవడంతో గ్రామాల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. బంధువులు ఒకరినొకరు పలుకరించుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. భోగి పండగ ఆదివారం రావడంతో చికెన్ సెంటర్ల వద్ద హడావుడి నెలకొంది.

**పల్లెల్లో..**

వెంకటాచలం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం తెల్లవారుజామున భోగి సంబరాలు జరుపుకున్నారు. వెంకటాచలం, కసుమూరు, చెముడుగుంట, గొలగమూడి, సర్వేపల్లి, తిక్కవరప్పాడు, ఈదగాలి, నిడిగుంటపాళెం గ్రామాల్లోని ప్రధాన సెంటర్లలో యువత తాటాకులలో భోగి మంటలు వేశారు. గ్రామాల్లో ప్రతి నివాసం వద్ద భోగి మంటలు వెలిగించి, కుటుంబ సమేతంగా సంబరాలు జరుపుకున్నారు.

**మనుబోలులో..**

మనుబోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండగను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ప్రతి ఇంటి వద్ద భోగి మంటలు వెలిగించారు. మండల కేంద్రమైన మనుబోలులో యువకులు పెద్ద ఎత్తున భోగి మంటలు వెలిగించారు.

# నేత్రపర్వం.. కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భోగి పండగ సందర్భంగా ఆదివారం శ్రీగోదాదేవి రంగనాథస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా ప్రతినిత్యం తిరుప్పావై పఠనం, ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరిరోజున భోగి నాడు శ్రీగోదాదేవి రంగనాథస్వామి కల్యాణాన్ని జరిపించారు. ఉభయకర్తలుగా ఆంద్రాజు దుర్గారావు–ఉత్తర దంపతులు వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి వాకాటి శ్రీనివాసులురెడ్డి, సభ్యులు ఎం.శ్యామ్‌ప్రసాద్‌నాయుడు, చొప్పా వెంకటేశ్వర్లు, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, సన్నికంటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

### నేడు తుమ్మగుంటలో మకరజ్యోతి ఉత్సవం

విడవలూరు : మండలంలోని తుమ్మగుంట గ్రామంలో వెలసిన గురునాథస్వామి (అయ్యప్ప స్వామి) దేవస్థానంలో సోమవారం శ్రీమకర జ్యోతి సందర్భంగా అయ్యప్ప స్వామికి ఉత్సవ వేడుకలు జరుగుతాయని దేవస్థానం చైర్మన్ యర్రంశెట్టి సుధాకర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

### నేడు తోడేరుకు మంత్రి కాకాణి

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండలంలోని తన స్వగ్రామం తోడేరులో సోమవారం ప్రజలకు అందుబాటులో ఉంటారు. కుటుంబసభ్యులు, గ్రామస్తులు, ఆత్మీయులు, నాయకుల మధ్య సంక్రాంతి సంబరాల్లో మంత్రి పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు నెల్లూరులోని స్వగృహానికి మంత్రి చేరుకుంటారు.

### రోడ్డుకు మరమ్మతు పనులు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని 20వ వార్డులో చెన్నూరు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ విషయం స్థానిక కౌన్సిలర్ శ్రీదేవి దృష్టికి రావడంతో ఆదివారం మరమ్మతు పనులు చేపట్టారు. కట్టుబడిపాళెం నుంచి రామచంద్రాపురం వరకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పెంచలయ్య, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఎడ్ల పందేలు



పోటీలను వీక్షిస్తున్న ప్రేక్షకులు



పోటీలో ఉత్సాహంగా తలపడుతున్న ఎద్దు

కోవూరు: మండలంలోని కొత్తూరు రోడ్డులో సంక్రాంతి పర్వదినం సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ఆదివారం అట్టహాసంగా జరిగింది. తొలుత పోటీలను డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా కోవూరు బండ్ల సంఘం, కోవూరు రైతు సమన్వయ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో ప్రకాశం, చీరాల, బాపట్ల, తూర్పుగోదావరి, కృష్ణాజిల్లా తదితర ప్రాంతాల నుంచి కూడా రైతులు ఉత్సాహంగా తరలివస్తున్నట్లు చెప్పారు. కోవూరు సీఐ టీవీ శ్రీనివాసరావు గౌడ్, వీరేంద్రబాబు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పడుగుపాడు సొసైటీ అధ్యక్షుడు మల్లికార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, రైతు సమన్వయ కమిటీ సంఘ సభ్యులు మల్లికార్జునరెడ్డి, నరేంద్రరెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి విజయకుమార్‌రెడ్డి, ఎం.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే..**

ఎడ్ల పందేల్లో కోవూరు మండలం చెన్నకేశవుల ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ జట్టుకు రూ.15,116లతో పాటు వెండి ట్రోఫీని అందజేశారు. అలాగే ద్వితీయ స్థానంలో చాముండేశ్వరి సీఫుడ్స్ గంగపట్నం, తృతీయ స్థానంలో పాటూరు గ్రామానికి చెందిన శ్రీ ఆంజనేయం ఎడ్ల జట్టు, నాలుగో స్థానంలో బాపట్ల జిల్లా కంకటపాళేనికి చెందిన అభయాంజనేయ స్వామి జట్టు, ఐదో స్థానంలో కోవూరుకు చెందిన శ్రీవీరాంజనేయస్వామి ఎడ్ల జట్టు నిలిచింది.



నాలుగో బహుమతి అందుకుంటున్న బాపట్ల జిల్లా వాసులు



ఐదో బహుమతి పొందిన కోవూరు శ్రీవీరాంజనేయస్వామి జట్టు

# కనుల పండువగా గోదాదేవి కల్యాణం



కోవూరు : కోవూరులో కొలువైన కోదండరామస్వామి దేవస్థానం ప్రాంగణంలో గోదాదేవి కల్యాణం ఆదివారం రాత్రి కనుల పండువగా జరిగింది. తొలుత అర్చకులు శ్రీకాంత్‌స్వామి, నాగరాజస్వామి ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా గోదాదేవి కల్యాణ విశిష్టతను వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని వీక్షించారు. ఉభయకర్తలుగా మాడిశెట్టి వెంకట్రావు, జయంతి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, దేవదాయ శాఖ ప్రతినిధి సంపూర్ణమ్మ, పాల్గొన్నారు.

## షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు మంచి రోజులు

కోవూరు : కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు మంచి రోజులు రానున్నాయని, వారి జీతాల బకాయిలు త్వరలో విడుదలవుతాయని రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి తెలిపారు. కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కార్మికుల జీతాల బకాయిలకు సంబంధించి ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి వివరించారని తెలిపారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి బకాయిల విడుదలకు ఆదేశాలు ఇచ్చారని తెలియజేశారు. జనవరి నెలాఖరులోగా ఉద్యోగులకు రావల్సిన రూ.22.34 కోట్లను విడుదల చేస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సుబ్బారెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిరంజన్‌బాబురెడ్డి

### ఎస్సీల సమస్యలపై వినతి

నెల్లూరు రూరల్: ఎస్సీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ విక్టర్ ప్రసాద్‌ను నగరంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. ఎస్సీల సమస్యలను విన్నవించగా, పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి, జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, రూరల్ మహిళా నేత అరవ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

